బీ'కరి' దాడులు

- సరిహద్దుల్లో స్వైరవిహారం
- భయం గుప్పిట్లో గ్రామీణులు
- పాఠశాలలోని కిటికీలు, సామాగ్రి ధ్వంసం
- వి.కోటలో పంటలను తొక్కి నాశనం చేసిన వైనం

ఏనుగుల దాడిలో నాశనమైన పంటను చూపుతున్న రైతు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం, వి,కోట: ఆంధ్రా-కర్నాటక సరిహద్దుకు చేరిన ఏనుగుల గుంపు గ్రామాల్లో బీకర దాడులు చేస్తున్నాయి. పంటపొలాలు, అరటి తోటలపై పడి నాశనం చేస్తున్నాయి. గుంపులుగా విడిపోయి స్వైర విహారం చేస్తూ బీభత్సం సృష్టిస్తున్నాయి. రాత్రైతే రైతులు, గ్రామస్తులు భయం గుప్పిట్లో బెంబేలెత్తిపోతున్నారు. ఏనుగుల గుంపును అడవుల్లోకి మళ్లించేందుకు అటవీ అధికారులు, రైతులు ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేకుండా పోతోందని స్థానికంగా విస్తుపోతున్నారు. బుధవారం రాత్రి బంగారుపాళ్యం, వికోట మండలాల్లో వేర్వేరు ఏనుగుల గుంపులు దాడులు చేశాయి.

బంగారుపాళ్యం మండలంలో ఇలా..

మండలంలోని కీరమంద ప్రభుత్వ పాఠశాల కిటికీలు విరిచి, పాఠశాలలోని మద్యాహ్న భోజన బియ్యపు బస్తాలు, రాగి జావా పిండిని ధ్వంసం చేశాయి. రాత్రైతే గ్రామాల సరిహద్దులకు చేరి అన్నదాత పంటలను నాశనం చేస్తున్నారు. గురువారం అధికారులు పాఠశాలలో ఏనుగుల దాడులను పరిశీలించారు. పాఠశాలలో ఏనుగుల దాడిలో వాటిల్లిన నష్టాన్ని అంచనా వేసి నివేదిక ఇవ్వాలని డీఈవో విజేంద్రరావు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు.

పాఠశాల కిటికీలను ధ్వంసం చేసిన ఏనుగులు

వికోట మండలంలో ఇలా..

మండలంలోని అటవీ సరిహద్దు ప్రాంతంలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. బుధవారం రాత్రి కొమ్మర మడుగు, వెంకటేపల్లి, దానమయ్యగారిపల్లిలో ఏనుగుల గుంపు రైతు రాజన్నకు చెందిన రెండు ఎకరాల అరటి తోటను ధ్వంసం చేశాయి. కొమ్మరమడుగుకు చెందిన సుబ్బన్న బీన్స్ తోట, శివప్ప మొక్కజొన్న పంటలను తిని తొక్కి నాశనం చేశాయి. సుమారు రూ.4లక్షల నష్టం ఉంటుందని రైతులు చెబుతున్నారు. కాగా నష్టపోయిన పంటలకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

రైల్వే ప్రైవేటీకరణ దేశద్రోహమే.!



సిఆర్ఎస్ గేట్‌మీట్‌లో మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాకుండా అక్కడ కార్మికులు ఐక్య పోరాటాలతో తిప్పికొడుతున్నారని, అదే తరహాలో రైల్వే ప్రైవేట్‌పరం కాకుండా ఉద్యమించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు పిలుపునిచ్చారు. రైల్వేను ప్రైవేటీకరించడం దేశద్రోహం అవుతుందన్నారు. గురువారం రేణిగుంట రైల్వే క్యారేజ్ రిపేర్ షాప్ ఆవరణంలో సాయంత్రం కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. రైల్వే కార్మికులను ఉద్దేశించి నర్సింగరావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సంస్థలు అమ్మకానికి పెట్టారని గుర్తు చేశారు. ఇందులో బిఎస్ఎన్ఎల్, ఎల్ఐసి, ఓఎన్జిసి గ్యాస్, బ్యాంకింగ్ వంటి రంగాలు ప్రైవేట్ పరం చేసి అదాని, అంబానీలకు కట్టబెట్టేందుకు పూనుకున్నారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కుట్ర చేశారని, అక్కడ వేయి రోజులుగా కార్మికులు ఐక్యంగా పోరాటంతో ఒక్క శాతం కూడా విశాఖ ఉక్కు ప్రైవేట్ పరం కాలేదని గుర్తు చేశారు. రైల్వేలను ప్రైవేటుపరం చేయడానికి మోడీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదిక చర్యలు చేపట్టిందని. కార్మికులు ఐక్యంగా ఉండి పోరాడితే ప్రైవేట్ పరాన్ని అడ్డుకోవచ్చని చెప్పారు. రైల్వే ని వ్యాపార సంస్థగా మార్చడానికి దేశంలో ఉన్న 400 రైల్వే స్టేషన్లను అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు, చర్యలు తీసుకున్నారని. కార్మిక వర్గం మౌనంగా ఉండకుండా ఐక్యతతో పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మోడీ గుజరాత్ లో కొన్ని రైల్వేస్టేషన్లో ప్రైవేటుపరం చేశారని అయితే అక్కడ నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో కూడా పలు పోర్టులను అదానికి కట్టబెట్టారని గుర్తు చేశారు. ఇటీవల దేశంలో జరిగిన రైలు ప్రమాదానికి రైల్వేలో కొన్ని విభాగాలను ప్రైవేట్‌పరం చేయడమేనన్నారు. రైల్వేలో ఖాళీగా ఉన్న మూడు లక్షల 50 వేల పోస్టుల భర్తీ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పేర్కొన్నారు. రైల్వేలో భద్రతకు ప్రాధాన్యత కల్పించాలని, సబ్సిడీలను కొనసాగించాలని, ప్యాసింజర్ రైళ్లు నడపాలని రైల్వే కార్మికులు పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా రేణిగుంట సిఆర్ఎస్ కార్మికులు పని ఒత్తిడికి గురవుతున్నారని, ఇక్కడ ఉన్న ఖాళీలను వెంటనే కేంద్ర ప్రభుత్వం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సిఆర్ఎస్ సామర్థ్యాన్ని పెంచి, యువతకు ఉపాధి కల్పించాలని కోరారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కేరత్నకుమార్ మాట్లాడుతూ రైల్వే ప్రైవేట్ కాకుండా తమ సంఘం ఉద్యమాలు చేస్తుందని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ రైల్వే ప్రైవేటీకరణకు మోడీ ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి కసరత్తు చేస్తోందని, దీన్ని సిఐటియు పూర్తిగా వ్యతిరేకిస్తోందన్నారు. రైళ్ల ప్రమాదానికి కారణం మోడీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. రైల్వేల అభ్యున్నతికి మోడీ ప్రభుత్వం కషి చేయడం లేదన్నారు. అదాని అంబానీల కోసమే రైల్వే ప్రైవేటీకరణ చేస్తున్నారని విమర్శించారు. రైల్వే కార్మికులు పెద్ద ఎత్తున ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు అంగేరి, పుల్లయ్య, జిబిఎస్ మన్యం, ఓ వెంకటరమణ, హరినాధ్, టి సుబ్రహ్మణ్యం, రేణిగుంట సిఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ నాయకులు సురేంద్ర రెడ్డి, మునెయ్య, సూర్యనారాయణ, రమణ పాల్గొన్నారు

సమస్యలపై నినదించేలా..
సర్కార్‌ను నిలదీసేలా..

- 8న సిఐటియు, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ సమ్మెకు పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్లక్ష్య దోరణితో వ్యవహరిస్తోందని, వెనువెంటనే సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ, ఏఐటీయూసి, ఐఎఫ్‌టీయూ సంయుక్తంగా రాష్ట్ర సమ్మెకు పిలుపునిచ్చాయి. గురువారం చిత్తూరులోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో ఆయా సంఘ నేతలు సంయుక్తంగా రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏపీ ప్రగతిశీల అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి వి ఆర్ జ్యోతి, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి షకీలా, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ప్రేమలు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. డిసెంబర్ 8న నిర్వహించబోయే రాష్ట్ర వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అదనపు వేతనాలు ఇస్తామని పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌తో ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోదండ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయకుండా వారిపై నిర్బంధాలకు గురిచేయడం దారుణం అన్నారు. అంగన్వాడీలతో పెట్టుకున్న ఏ ప్రభుత్వాలు మనుగడలో లేవని ఈ రాష్ట్ర ప్రభుత్వం గుర్తించుకోవాలని హెచ్చరించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంజివరం సురేంద్ర మాట్లాడుతూ సమస్యలను పరిష్కారం చేయకుండా సమ్మెను ఎలా నిర్వీర్యం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నదని, సమస్యలు పరిష్కారం చేస్తే సమ్మె చేయాల్సిన అవసరం లేదని హెచ్చరించారు. ఏపీ అంగన్వాడి వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షుడు వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఐసిడిఎస్‌ని నిర్లక్ష్యం చేస్తున్నదని, ప్రతి సంవత్సరం నిధుల్లో కోత పెడుతూ ప్రైవేటీకరణ దిశగా పావులు కదుపుతున్నదని దానికి రాష్ట్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని విమర్శించారు. నూతన విద్యా విధానాన్ని తీసుకువచ్చి అంగన్వాడీ సెంటర్లు నిర్వీర్యం చేయాలని చూస్తోందన్నారు. గతంలో అనేక రకాల సమస్యలపై పోరాటాలు చేసిన చరిత్ర అంగన్వాడీలకు ఉందని మరోసారి ఆ పోరాట పటిమ చూపి ప్రభుత్వ మెడలు వంచాలని చెప్పారు. ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రనాథ్ మాట్లాడుతూ పోరాటం చేసే వారిని అణిచివేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి సమస్యను పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న మూడు సంఘాల జిల్లా కార్యదర్శులు షకీలా, ప్రేమ, విఆర్ జ్యోతిలు మాట్లాడుతూ ఉమ్మడి కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు, లబ్ధిదారులలో విస్తృత ప్రచారం సమ్మె గురించి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో మూడు సంఘాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

కళ్యాణమస్తు చెక్కు పంపిణీ

- 4వ విడత రూ.3.53కోట్లతో 436మంది లబ్ది



లబ్దిదారులకు చెక్కు అందజేస్తున్న ఎంపి, కలెక్టర్, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు

కళ్యాణమస్తు, షాదీ తోఫా పథకం ద్వారా జిల్లాలో 4వ విడత సామాజిక వర్గాల వారీగా లబ్దిదారుల వివరాలు

ఎస్సీ	188	రూ.1.89కోట్లు
ఎస్టీలు	20	రూ.20.40లక్షలు
బిసిలు	180	95.50లక్షలు
మైనారిటీలు	45	రూ.45లక్షలు
బిఓసిడబ్ల్యుడబ్ల్యుబి	1	రూ.40వేలు
విభిన్న ప్రతిభావంతులు	2	రూ.3లక్షలు
మొత్తం	436	రూ.3.53కోట్లు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రాష్ట్రంలోని పేద తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించి, వారి వివాహాన్ని గౌరవప్రదంగా జరిపించే తమ సామాజిక బాధ్యత నిర్వర్తించేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మి కుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు ప్రభుత్వం 'వైఎ స్సార్ కళ్యాణ మస్తు' మైనారిటీలకు 'వైఎస్సార్ షాదీ తోఫా' అందిస్తున్నట్లు చిత్తూరు ఎంపి ఎన్.రెడ్డెప్ప అ న్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 4వ విడత జంటలకు వైఎస్సార్ కళ్యాణమస్తు (షాదీ తోఫా) నిధులను విర్చువల్ విధానంలో విడుదల చేశారు. చి త్తూరు జిల్లా సచివాలయం నుంచి ఎంపి రెడ్డెప్ప, జి ల్లా కలెక్టర్ ఎస్. షన్మోహన్, చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, మేయర్ అముద, జెడ్పి వైస్ ఛైర్మన్ రమ్య, రాష్ట్ర విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డి, రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమారరాజా, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఎంపి రెడ్డెప్ప మాట్లాడుతూ కళ్యాణమస్తు(షాదీ తో ఫా) అందుకున్న లబ్దిదారులు సక్రమమైన రీతిలో ఉపయోగంచుకోవాలని సూచించారు. రాష్ట్ర అబి వృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరుకుంటు న్నట్లు చెప్పారు. జిల్లా కలెక్టర్ జిల్లాలో లబ్దిదారుల వివ రాలను వెల్లడిస్తూ.. 4వ విడతతో 436మందికి రూ .3.53కోట్లు లబ్ది చేకూరిందని తెలిపారు. వివిధ సామాజిక వర్గాల వారీగా రూ.40వేల నుంచి రూ .1.50లక్షల వరకు ఆర్థిక సాయం అందింద`న్నారు. వయస్సు పరిమితి దాటి ప్రభుత్వ నిబంధన ప్రకారం పదవ తరగతి పూర్తి చేసుకన్న వారు ఈ పథకం వర్తిస్తుందన్నారు. మొదట విడత నుంచి ఇప్ప టి వరకు జిల్లాలో 1511 మంది లబ్దిదారులకు గా నూ రూ.11.96కోట్లు విడుదలైనట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు చెక్కును అందజేశా రు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి తులసి, జిల్లా సాం ఘీకశాఖ అధికారిణి రాజ్యలక్ష్మి, ఈడీ బిసి కార్పొరేషన్ శ్రీదేవి, కార్పొరేటర్ హరిణిరెడ్డి, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం.. అతిక్రమిస్తే కఠిన చర్యలు

కలెక్టర్ హెచ్చరిక

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: స్త్రీ పురుషుల నిష్పత్తి చాలావరకు తగ్గిపోతోందని, క్షేత్రస్థాయిలో ప్రైవేటు ఆసుపత్రిలో స్కానింగ్ కేంద్రాలు ప్రధానంగా సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న స్కానింగ్ కేంద్రాల మీద నిఘా ఉంచాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో పిసిపిఎన్‌డిటి చట్టంకి సంబంధించి సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలు ఉన్న ప్రైవేటు ఆసుపత్రులు, సరిహద్దు ప్రాంతాలలో ఉన్న వాటి మీద నిఘా ఉంచాలని ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ కానీ గర్భం తొలగించుట కానీ చేయకూడదని అన్నారు. ఈ చట్టానికి సంబంధించి ప్రైవేట్ ఆసుపత్రులలో పక్కాగా రిజిస్టర్ల నిర్వహణ పకడ్బందీగా ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో నిర్ధారణ జరుగుతుందని కొన్ని ఫిర్యాదులు అందుతున్నాయని అటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సిబ్బందిపై ఉందని అన్నారు. జిల్లాలోని మొత్తం 31 మండలాల్లో 16 మండలాలలో స్త్రీ పురుషుల నిష్పత్తిలో చాలావ్యత్యాసం కలదన్నారు. ఈ సమావేశంలో భాగంగా యుఎస్‌కు చెందిన గ్లోబల్ ఫౌండేషన్ వారు టిబి వ్యాధిగ్రస్తులకు ఇచ్చిన రూ.1.2లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ వైద్య అధికారులకు అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ప్రభావతిదేవి, డిఐఓ డాక్టర్ రవిరాజు, డిడి సోషల్ వెల్ఫేర్ రాజ్యలక్ష్మి, గిరిజన సంక్షేమ అధికారి మూర్తి, డాక్టర్ హర్షవర్ధన్, డాక్టర్ శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

యాంటీబయోటిక్ మందులు వాడరాదు

డిఎంహెచ్వో ప్రభావతి దేవి

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్ : యాంటీబయోటిక్ మందులు వాడరాదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రభావతి దేవి అన్నారు. గురువారం చిత్తూరు ఆసుపత్రి నందు ఈనెల 18 నుంచి 24 వరకు జరుగుతున్న "ప్రపంచ ఆంటీ మైక్రోబియల్ అవగాహన వారోత్సవాల" సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు అనారోగ్యం పాలైనప్పుడు ఎలా పడితే అలా ఆంటీ బయోటెక్ మందులు వాడరాదన్నారు. అలా వాడినట్లైతే రోగనిరోధక శక్తి తగ్గి వెనుకటికి ఆ మందులు పనిచేయవన్నారు. కావున ఆర్ఎంపి డాక్టర్ల వద్ద చూపించుకోరాదన్నారు. ఇష్టం వచ్చినట్లు మందులు ఇచ్చి స్టెరాయిడ్లతో త్వరగా నయమయేట్లు చేస్తారన్నారు. తర్వాత కాలంలో వచ్చే వ్యాధులకు ఏ మందు పని చేయవన్నారు. ఎంబిబిఎస్ డాక్టర్ల వద్ద మాత్రమే వైద్యం చేయించుకోవాలన్నారు. ఈ విషయాలను ప్రజలందరికీ తెలయజేసేందుకు యాంటీ మైక్రోడియల్ వారోత్సవాల అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ అరుణ కుమార్, డాక్టర్ గోపాల్, డాక్టర్ సుదర్శన్, శ్రీవాణి పాల్గొన్నారు.

ఓటరు దరఖాస్తులను పక్కాగా పరిశీలించాలి



ఓటరు జాబితా సవరణపై మాట్లాడుతున్న కమిషనర్

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: ఓటరు దరఖాస్తులపై పరిశీలన పక్కాగా ఉండాలని కమిషనర్ డాక్టర్ అరుణ అధికారులను ఆదేశించారు. గురువారం నగరపాలక కార్యాలయంలో ఫిర్యాదులు, దరఖాస్తుల విచారణ, క్షేత్రస్థాయి పరిశీలన అంశాలపై సిబ్బందితో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితాకు సంబంధించి రాజకీయపార్టీల నుంచి అందిన ఫిర్యాదులు, డెత్, డూప్లికేట్, జీరో డోర్ నెంబర్, ఒకె డోర్ నెంబర్‌తో పదికంటే ఎక్కువగా ఉన్న వాటికి సంబంధించి క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని సూచించారు. విచారణ అనంతరం ధృవపత్రాలతో కూడిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకమైన ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి, పశుసంవర్ధకశాఖ జెడి ప్రభాకర్, మేనేజర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్ అధికారులు, బిఎల్వోలు పాల్గొన్నారు.

పకడ్బందీగా ప్రధాని పర్యటన ఏర్పాట్లు

ప్రధాని పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమావేశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: రెండు రోజుల తిరుమల, తిరుపతి పర్యటన సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఈ నెల 26, 27 తేదీలలో తిరుపతి జిల్లాకు విచ్చేయనున్నారని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లో భారత ప్రధాన మంత్రి తిరుపతి జిల్లా పర్యటన నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జె.సి డి కె బాలాజీ, జేఈఓ వీరబ్రహ్మం, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, జిల్లా రెవెన్యూ అధికారి, ఆర్డీవోలు, అదనపు ఎస్పీలు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన సాయంత్రం 6.55 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి ప్రధాని నరేంద్రమోదీ చేరుకుంటారని, అనంతరం రోడ్డు మార్గాన తిరుమల చేరుకొని రాత్రి బస చేసి మరుసటి దినం 27న ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని రేణిగుంట విమానాశ్రయం నుండి ఉదయం 10:25 గంటలకు తిరుగు ప్రయాణం కానున్నారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వారు స్పెషలిస్టు డాక్టర్లు ఏర్పాటు, అధునాతన లైఫ్ సపోర్ట్ అంబులెన్స్, 108, సేఫ్ రూమ్, తదితరాలు ఏర్పాటు ఉండాలని సూచించారు. అలాగే ఫైర్ సేఫ్టీ, ఫుడ్ సేఫ్టీ అధికారులు, విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ ఏర్పాటు, తగినంత లైటింగ్, రవాణా శాఖ వాహనాల ఫిట్నెస్ చెక్, కమ్యూనికేషన్ ప్లాన్ ఇంటర్నెట్ టెలిఫోన్ సదుపాయాలు, పోలీసు శాఖ ద్వారా పటిష్ట బందోబస్తు ఏర్పాటు ఉండాలని, శానిటేషన్ ఏర్పాట్లు సంబంధిత అధికారులు పక్కాగా ఉండేలా చూడాలని, అవసరమైన చోట బారికేడింగ్, రోడ్డు మరమ్మత్తులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. భారత ప్రధాని పర్యటన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ రానున్నారని వాటికి సంబంధించిన ఏర్పాట్ల కొరకు అధికారులకు విధులు కేటాయించాలని, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రధాని పర్యటన విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు ఏర్పాట్లను రేణిగుంట విమానాశ్రయం మొదలుకొని, భారత ప్రధాని పర్యటించు అన్ని ప్రాంతాలలో తగినంత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, వెంకటరావు, రాజేంద్ర, ఆర్డిఓలు నిశాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, చంద్రముని, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసులు, కోదండరామిరెడ్డి, శ్రీనివాసులు, భవాని, ప్రోటోకాల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్ నాయుడు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ బసవరాజ పాల్గొన్నారు.

శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం ప్రారంభం



ప్రజాశక్తి -తిరుమల: లోక కళ్యాణార్థం భవిష్యత్తులో టీటీడీ మరిన్ని భక్తి చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. అలిపిరి సమీపంలోని సప్త గో ప్రదక్షిణ మందిరంలో గురువారం ఉదయం శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ హోమం ప్రారంభోత్సవ కార్యక్రమంలో చైర్మన్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తరతరాలుగా సనాతన హైందవ సంస్కతిలో హోమానికి విశేష ప్రాధాన్యత ఉందన్నారు. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో శ్రీవారి పాదపద్మముల వద్ద ఈ హోమ కార్యక్రమాన్ని శాశ్వతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంతో ఖర్చు, శ్రమ తో కూడిన హోమ కార్యక్రమాన్ని భక్తుల కోసం తక్కువ ఖర్చుతో ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 9 నుండి 11 గంటల వరకు నిర్వహించనున్నట్లు చెప్పారు. సప్త గో ప్రదక్షిణ మందిరం నందు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన హోమ వేదిక వద్ద ప్రతిరోజూ 100 మంది గహస్తులు పాల్గొనేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఆన్లైన్లో డిసెంబర్ 31వ తేదీ వరకు హోమం టికెట్లు బుక్ అయ్యాయని తెలిపారు. భక్తులు వర్చువల్ గానూ ఈ హోమ కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు. దాత సహకారంతో త్వరలో దాదాపు 500 మంది గహస్తులు కూర్చుని ఈ హోమ కార్యక్రమంలో పాల్గొనేలా వేదికను నిర్మించనున్నట్లు చైర్మన్ తెలిపారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి మాట్లాడుతూ, భగవంతుని ఆరాధించే అనేక పద్ధతుల్లో హోమ కార్యక్రమం అత్యంత ప్రాసస్యమైందని తెలిపారు. హోమం చేయడం, గానం చేయడం ద్వారా భగవంతుని త్వరగా చేరుకోవచ్చన్నారు. ఎస్వీ వేద విశ్వ విద్యాలయం నుంచి గురువారం ఉదయం ఏడు గంటలకు శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హోమం ప్రారంభోత్సవ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో ఎవి ధర్మారెడ్డి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పారిశుధ్య, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూనియన్ గౌరవాధ్యక్షులు ఎస్.నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కమిటీ సమావేశం ఎస్టియు కార్యాలయంలో జయశంకర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్.నాగరాజు మాట్లాడుతూ చిత్తూరు నగరపాలక సంస్థ పారిశుద్ధ్య విభాగంలో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో నగర పాలక సంస్థ అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. గత సంవత్సర కాలంగా పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాతపూర్వకంగా సంబంధిత కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, హెల్త్ ఆఫీసర్‌కి రాతపూర్వకంగా తెలియజేసినప్పటికీ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పుష్ కాట్ కు ఇద్దరు సిబ్బందిని ఇవ్వాలని, ట్రాక్టరు, టిప్పర్లకు ముగ్గురు ఇవ్వాలని, సరిపడ్డ పనిముట్లను ఇవ్వాలని జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో కార్మికులకు హెల్త్ అలవెన్స్ మంజూరు చేస్తుంటే చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ లో మాత్రం సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. యూనిఫారం రెండు సంవత్సరాలకు, నూనె, చెప్పులు ఒక్కొక్క సంవత్సరం ఇవ్వాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రతి కార్మికునికి రెయిన్ కోట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తడి, పొడి చెత్త పేరుతో కార్మికులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. చెత్తను వేరు చేస్తున్నప్పటికీ మధ్యాహ్నం పైన కంపోస్టు యాడ్‌కు రమ్మనడం ఎంతవరకు సమంజసం కాదన్నారు. ప్రజలు చెత్తాచెదారాన్ని డంపింగ్ బాక్స్‌లో వేస్తుంటే అందులోని చెత్తను కింద కుమ్మరించి వేరుచేయమనడం శోచనీయం అన్నారు. గ్రామ సచివాలయంలోని హెల్త్ సెక్రటరీలు కార్మికులను వేధించడం, కార్మికులకు పని భారం ఎక్కువగా పెట్టడం టైంకు ఇంటికి పంపించకపోవడం బాధాకరమన్నారు. బజారు వీధిలో ఒక వర్కర్‌ను కూడా పెట్టకపోవడం సరైనది కాదన్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో డిసెంబర్4 నుండి కార్మికులు వివిధ రూపాల్లో కార్మికులు నిరసన చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

ఉత్తమ పర్యాటక రంగాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పర్యాటక శాఖ 2024 సంవత్సరానికి ఉత్తమ పర్యాటక రంగాల వారసత్వ పర్యాటకం, వ్యవసాయ పర్యాటకం, కళాఖండాల బాధ్యతాయుత పర్యాటకం, శక్తివంతమైన గ్రామాలు, కమ్యూనిటీ అధారిత, వెల్నెస్ రంగాలకు సంబంధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి జి. నరేంద్రబాబు తెలిపారు. దీనికి సంబంధించి ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూరల్ టూరిజం వెబ్‌సైట్‌ను సంప్రదించి ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందులో ఎంపికైన బెస్ట్ రూరల్ టూరిజం విలేజ్ రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో పురస్కారాలు అందచేస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9966535697 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కార్వేటినగరం: ఎపి స్కిల్ డెవెలప్మెంట్ సంస్థ ద్వారా నిరుద్యోగులకు ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడివో మోహన్‌మురళి అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అడ్వాన్స్ టెక్నాలజీపై మూడు నెలల పాటు ఉచితంగా ప్రభుత్వ శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందొచ్చన్నారు. ఎన్ఎన్ఈసీ, ఎపిఎస్ఎస్డిసి సర్టిఫికేట్లు అందించడం జరుగుతుందన్నారు. ఎస్ఎస్ సి, ఐటిఐ, ఇంటర్, ఇతర డిగ్రీ అర్హత కలిగిన 18-30ఏళ్లలోపు ఉన్న యువతీ, యువకులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. వివరాలకు 8142509017నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

పిహెచ్‌సికి సర్జికల్ క్లాత్ విరాళం

సర్జికల్ క్లాత్‌ను అందజేస్తున్న దాతలు

ప్రజాశక్తి-గంగాధరనెల్లూరు: మండలంలోని మూడు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు గురువారం దాతలు సర్జికల్ క్లాత్‌ను విరాళంగా ఇచ్చారు. చిత్తూరుకు చెందిన ఎం.వి కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ ఛైర్మన్ ఎం.వి శ్రీధర్‌రెడ్డి ఆసుపత్రిలో అవసరమయ్యే సర్జికల్ గ్రీన్ క్లాత్‌ను అందించారు. మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుబు పాపిరెడ్డి ప్రోత్సాహంతో మూడు ఆసుపత్రులకు ఈ క్లాత్‌ను 23మీటర్ల చొప్పున అందజేశారు.

అంగన్వాడీ కేంద్రాలకు త్వరలో మహర్దశ

సమావేశంలోమాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో పద్మసునంద

ప్రజాశక్తి-కార్వేటినగరం: అంగన్వాడీ కేంద్రాలకు త్వరలో మహర్ధశ రానుందని సిడిపివో పధ్మసునంద అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో అంగన్వాడీ సిబ్బందికి, ఇంజనీర్ అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ప్ర భుత్వం నాడు-నేడు పథకం ద్వారా అంగన్వాడీలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా ఫేజ్2లో 63 అంగన్వాడీ కేంద్రాలకు మర్మత్తులు చేపట్టడానికి ప్రణాళిక సిద్ధమైందన్నారు. ప్రతి కేంద్రంలోను విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఏర్పాటు చేసుకోవాలని, అలాగే కమిటీ మెంబర్లు ఎంపికైన వారు బ్యాంకు ఖాతాలు ప్రారంభి ంచు కోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో నిర్వహించే నా డు-నేడు పనులు నాణ్యతా ప్రమాణాలు పాట ించాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఐసీడీఎస్ అధికారి మోహ న్‌రెడ్డి, ఎంపీడీవో మోహన్‌మురళీ, ఎంఈవో విజ యకుమార్. సూపర్‌వైజర్లు ఇందిరా శ్యామిని, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సోమల: మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం ఎంపిపి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపిడివో నాగరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం మద్యాహ్నం ఎంపిడివో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అన్ని శాఖ అధికారులు శాఖాపరమైన అజెండాలతో సమావేశానికి విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

యాదమరి ఎస్ఐగా మునస్వామి

ప్రజాశక్తి-యాదమరి: మండల ఎస్ఐగా మునస్వామి గురు వారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో మునస్వామి రాళ్లబుదుగురు నుంచి యాదమరికి బదిలీ అయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ సుమన్ రాళ్ల బుదుగూరుకు వెళ్లారు. కాగా గురువారం మునస్వామి యా దమరి స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. శాంతి, భద్రతలపై బాధ్యతగా వ్యవహరిస్తానని ఈ సందర్భంగా తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి నోములు

ప్రజాశక్తి-సోమల: కార్తీక మాసం ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని అన్ని శివాలయాలలో గురువారం ఏకాదశి నోముల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండి మహిళలు గౌరీ వ్రతాన్ని నోచుకునేందుకు ఆలయాల వద్దకు చేరుకుని సామూహికంగా వ్రతాన్ని నిర్వహించి కేదారేశ్వర వ్రతాన్ని నిర్వహించారు.

వైభవంగా సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-నగరి: సత్యసాయి జయంతి వేడుకలను నగరి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. గురువారం నగరి పట్టణ కన్వీనర్ మురళీధర్, తడుకుపేట కన్వీనర్ రమణల ఆధ్వర్యంలో సత్యసాయి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేసి హారతి పూజలు నిర్వహించారు. ప్రత్యేక భజనలు చేశారు. విచ్చేసిన భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. అనంతరం టీఆర్ కండ్రిగలోని శిరీడ్స్ దివ్యాంగల పాఠశాలలోని దివ్యాంగులకు అన్నదానం చేశారు.

ప్రతి జాబ్ కార్డుకూ వంద రోజుల పనిదినాలు

ప్రజాశక్తి-సోమల: ప్రతి జాబ్‌కార్డు దారునికి వంద రోజుల పని కల్పిస్తున్నట్లు ఎపివో దినకరబాబు తెలిపారు. గురువారం మండలంలోని 81చిన్న ఉప్పరపల్లి సచివాలయంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పనులు గుర్తింపునకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణులు ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన పంటలకు ఉపాధిహామీ ద్వారా తోడ్పాటందిస్తున్నట్లు చెప్పారు. రైతులు పొలాల్లో మునగ, డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జయశంకర్, టిఎ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రూ.2కోట్లతో టిటిడి కళ్యాణ మండపం

- పబ్లిక్ కాంట్రిబ్యూషన్ రూ.40 లక్షలు అందించిన మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి-నగరి: మండలంలోని బుగ్గ అగ్రహారంలో రూ. 2కోట్ల వ్యయంతో టీటీడీ కళ్యాణ మండపం నిర్మిస్తున్నట్లు మంత్రి ఆర్కేరోజా తెలిపారు. గురువారం అలిపిరి శ్రీ వేంకటేశ్వర సప్తగోప్రదక్షిణశాలలో నిర్వహించిన శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహ విశేష హెూమంలో పాల్గొన్న ఆమె కళ్యాణ మండపం నిర్మాణానికి టీటీడీ నిబంధనల మేరకు చెల్లించాల్సిన 20 శాతం పబ్లిక్ కాంట్రిబ్యూషన్ రూ.40 లక్షల రూపాయలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ నగరి పరిసరప్రాంతాల ప్రజల చిరకాల కోరిక టీటీడీ కళ్యాణ మండపమన్నారు. అది త్వరలో నెరవేరుతుందన్నారు. నిర్మాణానికి రూ.2కోట్లు టీటీడీ మంజూరు చేసిందని అందులో నిబందల మేరకు చెల్లించాల్సిన 20 శాతం పబ్లిక్ కాంట్రిబ్యూషన్‌కు కూడా చెల్లించడం జరిగిందన్నారు. త్వరలో టెండర్లు పిలుస్తారని అది అయిన వెంటనే నిర్మాణం ప్రారంభమౌతుందన్నారు. 500 మంది కూర్చునేలా మ్యారేజి హాలు, ఒకసారికి 200 మంది కూర్చునేలా డైనింగ్ హాలు దానికి అనుబంధంగా కిచెన్, స్టోర్ రూము, వరుడు, వధువులకు అటాచ్డ్ బాత్రూమ్ ఉండేలా కళ్యాణ మండపం నిర్మించడం జరుగుతుందన్నారు. బుగ్గ కాశీ విశ్వేశ్వరాలయానికి సమీపంగా నిర్మిస్తున్నందున నగరి, నిండ్ర, విజయపురం మండలాలకు చెందిన సుమారు 60 గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు ఎలాంటి ఇబ్బందులకు లోనుకాకుండా తక్కువ వ్యయంతో పెళ్లిల్లు చేసుకునేసౌకర్యం కలుగుతుందన్నారు. పార్కింగ్‌కు ఎలాంటి సమస్య ఉండదని, ఆలయం, శంకరమఠం లాంటివి పక్కన ఉన్నందున విచ్చేసేవారికి బసతో పాటు అన్నివిధాలుగాను సౌకర్యగా ఉంటుందన్నారు. ఇప్పటికే వడమాలపేట మండలం అప్పలాయ గుంటలో 7 కోట్ల వ్యయంతో కళ్యాణ మండపం నిర్మించడం జరిగిందన్నారు. పుత్తూరులో టీటీడీ కళ్యాణ మండపం నవీకరించామన్నారు. రూ. 1.85 కోట్ల వ్యయంతో షాదీ మహల్ నిర్మించడం జరిగిందన్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



బంగారుపాళ్యంలో

ప్రజాశక్తి-రామకుప్పం: బడుగు బలహీనవర్గాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని చిత్తూరు జిల్లా ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని చిక్కపల్లి తండా పంచాయతీ కొర్లనుకొండ, టేకుమారు తాండ, చలమిచేను తండా గ్రామాల్లో ఆమె పర్యటించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాకాలను ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక, అభివృద్ధి చెందాలని తెలిపారు. కుప్పం నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ ను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో స్టేట్ డైరెక్టర్ నాగమ్మ చెంగప్ప, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, మండల కన్వీనర్ బాబు రెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, మండల ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి, సర్పంచ్ చిన్న రాజునాయక్, మోహన్‌నాయక్, భాస్కర్‌నాయక్, ఎంపీటీసీ రవి నాయక్, మునెమ్మ, వైసిపి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ఎపి సంక్షేమ ప్రదాత సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గురువారం మండలంలోని కొదలమడుగు సచివాలయంలో ఏపికి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని సర్పంచి మాలతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి భేదాభిప్రాయాలు లేకుండా సంక్షేమ ఫలాలు అందించిన సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, సర్పంచులు రాజా, నాయకులు అన్నామల్ రెడ్డి, రఘు, కిషోర్ కుమార్‌రెడ్డి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పద్మావతి విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 విభాగంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థి నులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.భువనేశ్వరి అభినం దించి ప్రశంశా పత్రాలు, మెడల్స్‌ని అందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రీడలు మనిషి శక్తిని కొత్త పుంతలు తొక్కించడంతోపాటు మనోరంజక సాధనలో ముఖ్య భాగమని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు డి.మునివేని సిఈఎల్, రెజ్లింగ్ గోల్డ్ మెడల్, జిమ్నాస్టిక్ లో బ్రాంజ్ మెడల్, జి గంగానీలావతి సిఇసి రెజ్లింగ్ లో సిల్వర్ మెడల్, టి. ఆరతి సిఇసి, కరాటేలో సిల్వర్ మెడల్, టెక్వాన్లో బ్రాంచ్ మెడల్, కె పల్లవి బైపిసి, కరాటేలో బ్రాంజ్ మెడల్, ప్రథమ సంవత్సరం విద్యార్థినులు చాతుర్య, సిఇసి జిమ్నాస్టిక్స్ లో గోల్డ్ మెడల్, సి వైశాలి రెజ్లింగ్ లో సిల్వర్ మెడల్, 2 గోల్డ్ మెడల్స్ 4 సిల్వర్ మెడల్స్ 2 బ్రాంజ్ మెడల్స్ ఇందులో గోల్డ్ మెడల్స్ సాధించిన ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థినులను, వీరికి శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని ప్రిన్సిపాల్, డాక్టరు జయమ్మ, అధ్యాపకులు అభినందించారు.

పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : తపాలా శాఖ పథకాలను ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని తపాలా కార్యా లయ సూపరింటెండెంట్ కుమార్ సూచించారు. భీమవరం నుండి ఉద్యోగోన్నతిపై వచ్చిన గూడూరులోని ప్రధాన తపాలా కార్యాలయంలో ఆయన సూపరింటెండెంట్ గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కుమార్ మాటా ్లడుతూ తపాలా కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న పథకా లు, ఇన్సూరెన్స్ లను సమీపంలోని తపాలా కార్యాలయాల్లో తెలుసుకుని ప్రయోజనం పొందాలని తెలిపారు.

మురికి గుంతలుగా సీసీ రోడ్లు

ప్రజాశక్తి -ఏర్పేడు : మండలంలోని పాత వీరాపురం గ్రామ పంచాయతీలోని పలు సీసీ రోడ్లు చిన్నపాటి వర్షానికే మురి కి గుంతల్లా మారుతున్నాయి. ప్రభుత్వ స్కూలుకి, సచివా లయానికి వెళ్లే పిల్లలు, గ్రామస్తులు పాచిపట్టి నీటిలో జారి పడి ప్రమాదానికి గురవు తున్నారు. ఇది బాధాకరమని గ్రామస్తులు, పిల్లలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వ అధికారులు వెంటనే గుర్తించి ఈ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తుల కోరుతున్నారు.

28న ఏర్పేడు మండల సమావేశం

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయియంలో ఎంపిపి పన్నూరు గీతా అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని ఎంపిడివో ఏ గిడ్డయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి శాసనసభ్యులు, పార్లమెంటు సభ్య లు, కలెక్టర్, డివిజనల్ స్థాయి అధికారి, అధ్యక్షులు, సభ్య లు, కో ఆప్టేడ్ సభ్యులు, గ్రామ పంచాయతీ సర్పంచులు, శ్రీకాళహస్తి ఏపీ సీడ్స్ వారు, శ్రీకాళహస్తి వ్యవసాయ కమిటీ, సింగల్ విండో అధ్యక్షులు, ముఖ్య కార్య నిర్వా హకారి, జిల్లా పంచాయతీ అధికారి,మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, విలేకరు లు హాజరుకావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో 20 రకాల అంశాలపై చర్చిస్తారని తెలిపారు.

గ్రామీణ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు : గ్రామీణ అభివృద్ధి వైసిపి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని ఎస్ఎస్‌బి పేటలో రూ.46 లక్షల గ్రామీణ నీటిపారుదల శాఖ నిధులతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన ప్రజల సంక్షేమం తో పాటు గ్రామ అభివృద్ధి ప్రభుత్వానికి రెండు కళ్లు అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు మధుసూదన్, ఎంపిడివో శ్రీనివాసులు , గ్రామీణ నీటిపారుదలశాఖ డిఈ దామోదర్ నాయుడు, వైసిపి మండల కన్వీనర్ కె.చలపతి రాజు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కెవిభాస్కర్ నాయుడు, వైసిపి ఉపాధ్యక్షులు రమేష్ రాజు, సుబ్రమణ్యం రెడ్డి, సర్పంచ్ మనోహర్, తోపయ్య, చెంగలరాయల్ రెడ్డి, పాల పద్మనాభం, సర్పంచ్ కిరణ్ కుమార్ నాయుడు, మోహన్, సూరిబాబు రెడ్డి, మండల అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

క్యాంటీన్ టెండర్ దరఖాస్తుల గడువు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని క్యాంటీన్ కు నూతనంగా టెండర్ల దరఖాస్తులను ఈ నెల 29వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో వున్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు, ఆశావహులు ఈనెల 29వ తేదీ సాయంకాలం ఐదు గంటల లోపల వారి బిడ్ సబ్మిట్ చేయవచ్చని అన్నారు.

యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల వాల్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్న యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశానికి సంబంధించి స్వర్ణోత్సవ సంబరాల వాల్ పోస్టర్‌ను జి.వి.ఆర్ కన్వెన్షన్ హాల్ వేపగుంట సమీపంలో ఆహ్వాన గోడపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా తిరుపతి జిల్లా సహాధ్యక్షులు కందల శ్రీదేవి, మండల యుటిఎఫ్ నాయకులు చెంగల్ రాజు,ముని కుమార్ , ఆనంద్, నాగేంద్రప్రసాద్ ,కందల దేవరాజులు, బాబు, నాగజ్యోతి శాంతి, దాసరి మునెయ్య పాల్గొని ఆహ్వానించారు.

కులగణను పక్కాగా నిర్వహించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో కులగణన సర్వే ను పక్కాగా నిర్వహిం చాలని తహశీల్దారు భార్గవి తెలి పారు. మండల తహశీల్దారు కార్యాలయంలో సచివాలయ సిబ్బంది, వీర్వోలతో కులగణనపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కులగణనను సర్వేను సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో నిర్వహించాలన్నారు. కుటుంబ సభ్యుల వివరాలను ఫోన్ ద్వారా చేయాలన్నారు. సర్వేలో కుటుంబలో రేషన్ కార్డు వివరాలు, విద్య మరుగుదొడ్లు, తాగు నీరు గేదెలు, కోళ్లు, వంట గ్యాస్, లేదా కట్టెల పొయ్య తదితర వివరాలు కూడా నమోదు చేయాలన్నారు. సర్వేలో కుటుంబ సభ్యులు చెప్పిన కులం మాత్రమే నమోదు చేయాలన్నారు. కులానికి సంబంధించిన ఆధారాలు అడగకూడదని తెలిపారు. సర్వే పూర్తయిన తరువాత ఈకేవైసీ, బయోమెట్రిక్ తప్పని సరిగా చేయాలన్నారు పది రోజుల లోపు. సర్వేను పూర్తి చేయలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో త్రివిక్రమావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య సచివాలయ సిబ్బంది రెవెన్యూ విఆర్వోలు పాల్గొన్నారు.

మహిళా రక్షణ యాప్స్‌లపై అవగాహన పెరగాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక సంజయ్ గాంధీ కాలనీలోని మహిళలకు మహిళా రక్షణకు టోల్ ఫ్రీ నెంబర్స్, మొబైల్ యాప్స్ లపై గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ ఈ. కోనప్రభ మాట్లాడుతూ నేటి సాంకేతిక యుగంలో సమాజంలో ఎన్నో మార్పులు చోటుచేసుకుంటూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నప్పటికీ రోజురోజుకీ బాలికలు, మహిళల పై లైంగిక వేధింపులు, దాడులు, హత్యలు పెరిగిపోవడం బాధాకరమన్నారు. మహిళల రక్షణకు టోల్ ఫ్రీ నెంబర్స్, మొబైల్ యాప్స్‌లపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బాలికలు, మహిళలు అకస్మాత్తుగా ఇబ్బందులలో పడినా, తాము ప్రమాదంలో ఉన్నామని భావించినా, ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా ఆత్మవిశ్వాసంతో అప్రమత్తంగా వ్యవహరించాలని ధైర్యంగా మహిళల రక్షణకై ఉన్న టోల్ ఫ్రీ నెంబర్స్, మొబైల్ యాప్ లను ఉపయోగించుకొని ప్రమాదం నుండి బయటపడాలన్నారు. మహిళల రక్షణకై ఉన్న 100, 112, 181, 139 మొదలైన టోల్ ఫ్రీ నెంబర్స్ ఏపీ పోలీస్ సేవ యాప్, దిశ యాప్‌ల గురించి మహిళలకు అవగాహన కలిగించారు, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు.

ఎన్నికల ప్రక్రియలో బిఎల్ఓల పాత్ర ప్రధానం

- జాయింట్ కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: ఎన్నికల ప్రక్రియలో మార్పులు, చేర్పులు చేయడంలో బిఎల్ఓల పాత్ర అత్యంత ప్రాధాన్యం అని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. గురువారం చిత్తూరు నగర పాలక కార్యాలయంలో నగర పాలక పరిధిలోని బిఎల్ఓలతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ డిసెంబరు 9 లోపున మార్పులు చేర్పులకు అవకాశం వుందని ఎన్నికల ప్రక్రియలో అత్యంత పారదర్శకంగా చేయాలన్నారు. నిర్ణీత కాలవ్యవధి లోపున ఓటర్ లిస్టులో చేర్పులు, మార్పులు, తీసివేతలుకు సంభందించి ధరఖాస్తులు వచ్చినట్లయితే అందుకు ఎన్నికల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు కావాల్సిన సపోర్ట్ డాక్యుమెంట్లుతో నోటీస్‌లు ఇచ్చిక్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఫారం6కు సంభందించిన దరఖాస్తులు వచ్చినపుడు అందుకు కావల్సిన 8రకాల సపోర్ట్ డాక్యుమెంట్లుతో పాటు ఫిజికల్ వెరిఫికేషన్ చేయాలని అన్నారు. అదేవిధంగా ఫారం 7 వచ్చినపుడు కావాల్సిన డాక్యుమెంట్లు ఉంచడంతో పాటు క్లైయిమ్స్ పెట్టిన వారి కుటుంబ సభ్యులకు నోటీస్ ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించాలి. ప్రతి దరఖాస్తును అత్యంత జాగ్రత్తగా పరిశీలించాలని అన్నారు. ఏ దరఖాస్తులు అయినా నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారం చేయాలని అన్నారు. కార్యక్రమంలో అర్‌డివో చెన్నయ్య, తహశీల్దారు మురళిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఇఎండిపి సర్వే

ప్రజాశక్తి-యాదమరి: మండలంలోని కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ నందు డి.ఎ.ఇ సంస్థ ద్వారా వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం, 10 తరగతి విద్యార్థులను సర్వే నిర్వహించడం జరిగిందని ప్రధానోపాధ్యయురాలు ఎ.పిలలిత తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల, తల్లిదండ్రులు స్థితి గతులు, భవిష్యత్తులో ఏలాంటి స్థితి ఉండాలిని అని మీరు కోరుకుంటున్నారని పదవతరగతి విద్యార్థులను గూరించి డి.ఎ.ఇ. సంస్థ సూపర్వైజర్ రామలక్ష్మి, పెంచాలమ్మ, పావని, వందన, ట్యాబ్‌ల సర్వే నిర్వహించినారు. అలాగే ఇద్దరు టీచర్ కనకాచారి, భాస్కర్‌రెడ్డిల అభిప్రాయలను ఈ సర్వేలో నమోదు చేశారు. ఈ సర్వే పాఠశాల విద్యాకమీషర్ ఆంధ్రప్రదేశ్ వారి ప్రొసిడింగ్‌తో నిర్వహించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరొకరికి గాయాలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని మాధవన్ తోపు వద్ద చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తవణంపల్లి మండలం ముట్కూరు గ్రామానికి చెందిన శరవణ(20) ముట్టుకూరు గొల్లపల్లికి చెందిన పూర్ణ ద్విచక్ర వాహనంలో బంగారుపాళ్యంకు వెళుతుండగా చిత్తూరు వైపు వెళ్తున్న బస్సు ఢీ కొనింది. దీంతో సంఘటనా స్థలంలోనే శరణ మృతి చెందగా పూర్ణ పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రోయాకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి స్వాధీనం

- ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-గంగవరం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు డిఎస్‌పి సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందిన రహస్య సమాచారంతో పలమనేరు రూరల్ సిఐ కృష్ణమోహన్, గంగవరం ఎస్సై ప్రతాప్ రెడ్డి, గంగవరం డిప్యూటీ తాసిల్దార్‌తో కలిసి మండలంలోని మామడుగు బస్‌స్టాప్ వద్ద ఐదుగురు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వారు మండలంలోని మేలుమాయి పంచాయతీ కొత్తూరుకు చెందిన వెంకటప్ప కుమారుడు రాజేంద్ర గత కొంత కాలంగా గంగవరం, పలమనేరు పరిసర ప్రాంతాలలో గంజాయి అమ్ముతున్నట్లు సమాచారం ఉందన్నారు. ఇలా ఉండగా రాజేంద్ర ఈ మధ్య కాలంలో తన మోటార్ సైకల్ పై చింతపల్లి, తుని, నర్సిపటంలకు వెళ్ళి అక్కడ గంజాయి కొనుగోలు చేసేవాడని, అదే విధంగా చింతపల్లికు చెందిన వసంత రాజు వద్దనుండి రాజేంద్ర మూడు సార్లుగా 8, 14, 16 కేజీల గంజాయిని, ఒక్క కేజీ 2 వేలుకు తీసుకొని, వాటిని తన మోటార్ సైకల్ లో తన గ్రామానికి తీసుకొస్తున్నట్లు విచారనలో తేలినట్లు పేర్కొన్నారు. తన స్నేహితులైన డ్రైవర్సు కాలనీకి చెందిన శివ, యెశ్వంత్, అహమదుల్లా, తులసిలకు ఒక్క కేజీరూ.10 వేలుకు విక్రయించినట్లు తేలినట్లు వివరించారు. పలమనేరు ప్రాంతంలో నిఘా పెంచడంతో కర్నాటక ప్రాంతంలో విక్రయాలు జరుపుతున్నట్లు విచారణలో బహర్గతమైనట్లు తెలిపారు. బెంగళూరు వెళ్లడానికి సరుకుతో ఉన్న రాజేంద్ర, శివ, యశ్వంత్, అహమదుల్లా, తులసి బస్‌స్టాప్ వద్ద ఉండగా అదుపులోకి తీసుకొని బైక్, 10కిలోల గంజాయి, రూ.60వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఈ కేసులో చింతపల్లికి చెందిన వసంతరాజును త్వరలో అరెస్టు చేస్తామని తెలిపారు.

From No. 22 and 18

General Notice in respect of Interlocutary Application and Notice for appearance in Appeals Order 41 Rule 14 CPC, and Rules 1, 2, 4 and 11 of Chapter IV Karnataka High Court Rules

IN THE HIGH COURT OF KARNATAKA AT BENGALURU

MFA. No. 2451 / 2018 (MV-SJ)

SRI G. SOMASHEKAR,
S/O G. CHENGALRAYAPPA,
AGED ABOUT 22 YEARS, R/O NO. 31-165,
T. S. AGRAHARAM, PALAMNER,
CHITTOOR DISTRICT-741202.
BY Sri K T Gurudeva prasad ADV
....Appellant

Vs

National Insurance Co. LTD.,
T.P HUB, 2nd Floor, Shubharam Complex,
M G Road, Bengaluru - 560002
By Its Manager and another ....Respondents

Appeal From the Judgement / Award / Order Passed on dated 25/09/2017 in M.V.C No. 2100/ 2016 on the file of the IX ADDL SMALL CAUSES JUDGE & XXXIV ACMM, COURT OF SMALL CAUSES, MEMBER, MACT-7, BENGALURU (SCCH-7). IA NO.1/2018 for condone the delay of 72 days in filing the above appeal.

To : RESPONDENT NO. 2

2. SRI G. SHIVA SHANKAR,
S/O G. CHENGALRAYAPPA,
NO. 31-165, WARD NO.3,
POLICE LINE,
ADIDRAVIDA STREET,
FOREST BUNGLAW,
WEST FOREST BUILDING,
PALAMNER, CHITTOOR DISTRICT,
ANDHRA PRADESH-741202.

Whereas the aforementioned Appeal preferred has been registered by this Court.

NOTICE IS HEREBY given to you to appear in this Court in person or through an Advocate duly instructed or through some one authorised by law to act for you in this case on 18/12/2023 in case you intend to contest the appeal. If you fail so to appear, the appeal will be dealt with, heard and decided in your absence.

Given under my hand and the seal of this court on THE 17th DAY OF November 2023.

By order of the Court

Assistant Registrar